

# కాశ్రైసుపి నాగరాజన్

దేన్నైతే మర్చిపోయి బతకాలనుకుంటున్నాడో అదే తన చుట్టూ అల్లుకుని క్షణం క్షణం తనని బలంగా కౌగలించుకుని, తడి పెదవుల్తో ముద్దాడుతూ మరీ తనకి జీవితం ఇవ్వడం జరుగుతుంది. చివరికి తన స్థితి ఎలా వచ్చిందంటే దాని జ్ఞాపకంలో క్షణయూడా బతకలేడు. కానీ, అది తనతో లేకపోతే అసలు బతుకే లేదు.

మూడు దశాబ్దాల క్రితం గొప్ప నాగస్వర విద్వాంసుడుగా పేరు గడించి చచ్చి పోయాడు కారైకుడి వైద్యవిద్వాన్. బతకలేక చావలేక ప్రతిదినం చచ్చి బతుకుతున్న నాగరాజన్ అతని కొడుకు.

నాగరాజన్ వాళ్ల నాన్నకంటే గొప్ప విద్వాంసుడంటారు. అయితే అతను వాళ్ల నాన్నలా కచేరీలకీ, త్యాగరాజ ఆరాధనోత్సవాలకీ వెళ్లకుండా భార్య సలహామీద సినిమా ఆర్కెస్ట్రాల్లో వాయిస్తూ సంపాదిస్తున్నాడు. ఏ పాటకి నాగస్వరం అవసరం అయినా నాగరాజన్‌నే పిలుస్తారు మ్యూజిక్ డైరెక్టర్లు. మద్రాసులో తమిళం, తెలుగు, కన్నడం, మళయాళం భాషలపాటల రికార్డింగులూ, రీ రికార్డింగులూ నిత్యం జరుగుతూనే వుంటాయి. చాలా ఇన్‌స్ట్రుమెంట్స్ తాలుకు టోన్స్ కీ బోర్డులో వచ్చేస్తున్నాయి. నాగస్వరం కూడా కీ బోర్డులో వచ్చినా లైవ్‌లో వున్న ఫీలింగ్ సింథటిక్ టోన్‌లో రాదని నమ్మే మ్యూజిక్ కంపోజర్లు సితార్ కావాలంటే డేవిడ్‌ని, వీణ కావాలంటే పార్థసారథినీ, ఓబో కావాలంటే జార్జ్‌నీ, నాగస్వరం కావాలంటే నాగరాజన్‌నీ పిలుస్తారు. పైగా ఈ నాగస్వరం వాయించే మనిషి ఫీల్డు మొత్తం మీద నాగరాజన్ ఒక్కడే. ఆ కారణంగా చాలా బిజీగా వుంటాడు నాగరాజన్.

ముప్పయి అయిదేళ్లుంటాయి నాగరాజన్‌కి. సన్నగా, పొడుగ్గా వుంటాడు. అలవాటైన గోల్డ్‌ఫ్లేక్ ప్లెయిన్ సిగరెట్‌ని ఆర్టిస్టిక్‌గా కాలుస్తాడు. భార్యాపిల్లలతో సైతం ఎక్కువగా మాట్లాడడు.

తను పుట్టిన కొన్నాళ్లకి నాగగండం వుందని తేలిందట. అది విని వాళ్లమ్మ శోకాలు తీస్తూ తండ్రిని శాపనార్థాలు పెట్టింది. మీరు వాయించే నాగస్వరంలో అపశ్రుతులు వుండడం వల్లే చంటిబిడ్డకి ఈ సర్పగండం ఏర్పడింది అని. కొన్నాళ్లు గడిచాక ఆమె కలలో నాగుపాము కనిపించడంతో ఆకులా అల్లాడిపోయి దేవుడికి మొక్కుకుంది. తిరువత్తియూరు నాగేంద్ర స్వామి గుడికెళ్లి - నా భర్త తప్పిదానికి నా బిడ్డను క్షమించు స్వామీ! నా పిల్లాడికి నీ పేరే పెట్టుకుంటాను- అని.

చంటికుర్రాడికి నాగరాజన్ అని నామకరణం చేశారు. చాలాకాలం తరువాత పుట్టాడని మురిపెంగా పెంచడంతో చాలా అల్లరి చేసేవాడు నాగరాజన్. అతని గోలకి రోజులో నాలుగుసార్లు విసిగిపోయేది తల్లి. అన్నం తిననని గొడవ చేసేవాడు. తినకపోతే పామొస్తుందని, అల్లరి చేశావంటే నాగరాజొచ్చి తీసుకుపోతాడని భయపెట్టి అన్నం తినిపించేది తల్లి.

ఏడ్చావంటే పిల్లొస్తుందని, బూచాడొస్తున్నాడని భయపెట్టి వూరుకోబెడతారు చిన్నప్పుడు. కానీ పెద్దయినా చిన్నప్పుడు నాటుకుపోయిన ఆ భయాలు వాళ్ల నుంచి దూరం కావు. అసలు భయమంటే ఏంటో వాళ్లకి అలాగే తెలుస్తుందేమో...!

కొందరి విషయంలో అలాగే జరగకపోవచ్చు. నాగరాజన్ విషయంలో మాత్రం జరిగింది.

పెద్దవుతున్నా తననుంచి భయం దూరం కాలేదు సరిగదా, దానికి తోడు తనకి నాగగండం వుందని తెలిసేనాటికి తన భయం రెట్టింపయ్యి తనలో పూర్తిగా తిష్ఠ వేసుకు కూర్చుంది. పాము పేరెత్తితే చాలు గడగడ వణికిపోయేవాడు. తెల్లారితే తనకి ఎదురైన ప్రతివాడు తనకి పాము పేరు చెప్పి మరీ, పలకరించేవారు. అందుకు కారణం తన పేరు నాగరాజన్ కాబట్టి.

ఈ పాము భయంనుంచి దూరంగా పారిపోదామంటే వీలుకాని భార్య- బంధం. పోనీ చేసేపనిలో పూర్తిగా లీనమై మర్చిపోదామని ప్రయత్నిస్తే తను వాయించేది నాగస్వరం.

★★★

మేండ్లిన్, వీణ, సితార్‌లాంటి ఇన్‌స్ట్రుమెంట్స్‌ని మెయిన్‌గా వుంచి ఆడియో క్యాసెట్లు, కాంపాక్ట్ డిస్కులు చాలా విడుదల చేస్తున్నారు తప్ప, నాగస్వరం మీద ఈ మధ్యకాలంలో చేయలేదని, త్వరలో ఓ క్యాసెట్టు, డిస్కు విడుదల చెయ్యాలని నిర్ణయించారు హెచ్.ఎం.వి. గ్రామఫోన్ కంపెనీ వాళ్లు.

నాగరాజన్‌కి పిలుపొచ్చింది. సంగతంతా చెప్పి క్యాసెట్ సేల్స్ మీద రాయల్టీ పర్సంటేజ్ చెప్పారు వాళ్లు. క్యాసెట్టు ఐసి కవర్‌మీద మీ మల్టీకలర్ ఫోటో వేస్తామని కూడా చెప్పారు. రికార్డింగ్ డేట్స్ ఫిక్స్ చేశారు.

అంతా విని ఆనందపడ్డాడు నాగరాజన్. గొప్పవాళ్లదే తప్ప మామూలు వాళ్ల సంగీతం-క్యాసెట్లు, డిస్కుల రూపంలో రాదు మరి.

ఇరవైఆరో తేదీ పౌర్ణమి, లక్ష్మీవారం ఉదయం తొమ్మిది గంటలనుంచి రాత్రి తొమ్మిదివరకూ నాగరాజన్‌లోని సంగీత సరస్వతి నాగావళి ఏరులా నురగలు కక్కి సుడులు తిరిగి ప్రవహించింది. మౌంట్‌రోడ్డులో వున్న హెచ్.ఎం.వి. గ్రామఫోన్ కంపెనీ వాళ్ల సొంత థియేటర్లో రికార్డింగ్ పూర్తయ్యింది.

జన్మలో ఎప్పుడూ అనుభవించని వింత ఆనందంతో ఆటోలో ఇంటికి బయలు దేరాడు. నగరంలో వెన్నెల చాలా హాయిగా వుంది. ఆటో ఫ్లై ఓవర్ దాటుతుంటే పార్సన్ కాంప్లెక్స్ వెనుక స్పష్టంగా కన్పించిన చంద్రుడు అందంగా కనిపిస్తున్నాడు. చందనం రాసుకున్నట్టు పరిమళిస్తున్నాడు. ఆనందం ఎక్కువైన అతని గుండె అభిగుహలో హంసధ్వనిరాగం మంద్రంగా మూలిగింది.

ఆటో వాళ్లింటిముందు ఆగింది. పాతకాలం డాబా యిల్లది. పాత చెక్కగేటు దాటి ఓ పద్ధతిలో లేకుండా పెరిగిన పచ్చగడ్డిని ఇరవై అడుగుల దూరం తొక్కుకుంటూ వీథిగుమ్మంలోకి అడుగు పెట్టాలి.

గేటుతెరచి హుషారుగా పెరిగిన లాన్‌మీద బలవంతంగా అడుగులేస్తూ మూసివున్న యింటి తలుపులవైపు వెళ్తుంటే కాలిక్రింద ఏదో మెత్తగా నలిగినట్టనిపించి వెనక్కి వేశాడు అడుగు. నల్లగా, పొడుగ్గా వున్న పెద్దపాము. వెన్నెల్లో మెరుస్తూ చరచరా పాక్కుంటూ పగిలిన పూలతొట్టె వెనక వెళ్లి దూరిపోయింది.

అంతే...

తలుపు తెరచిన భార్య నాగరాజన్‌ని చూసింది.

చెమటతో వళ్లంతా పొంగడంతో లాల్చీ తడిసిపోయింది. శరీరం వణుకుతోంది. చిన్న కనుగుడ్లు పెద్దవిగా మారి ఎక్కడికో దూరతీరాలకి చూస్తున్నాయి.

అతని వాలకం చూసిన ఆమె క్షణం జడిసినా, క్షణాల్లో సెటిలై తీస్కెళ్లి గదిలో మంచంమీద పడుకోపెట్టింది.

★★★

గండం దగ్గర పడింది. తన జీవితకాలంలో పాము రావాల్సిన సమయం దగ్గర పడింది. నిన్ననే కుబుసం విడిచిన ఆరడుగుల పాము... పడగ విప్పితే రెండు కృష్ణపాదాలతో... మెరుస్తూ సరాసరి తనవైపే వచ్చే వేళయ్యింది. ఇక వచ్చేస్తుంది. జరజరా పాకుతూ వచ్చేస్తుంది తనవైపు. బుస్సుమని ఊపిరి విడుస్తూ ఝురఝుర శబ్దం...

కళ్లు విప్పాడు. పాము రాలేదు. పాదాలు దిగేవరకూ భార్య కట్టిన కొత్తలంగా నడిచేప్పుడు నేల రాసుకుంటుంటే విన్పించిన శబ్దం అది.

జాకెట్టు, లంగా మట్టుకే కట్టుకుని ఏ రంగు చీర బావుంటుందా అని బీరువాలో చీరెల దొంతర్ని తిరగేస్తున్న భార్య అతన్ని చూసి 'కాఫీ తేనా..?' అంది.

వద్దని తలూపాడు.

మేచింగ్ చీర తీసుకుని వెళ్లిపోతోంది భార్య. అతను ఆమె పాదాలకేసి చూశాడు. పడగ విప్పిన పాము తలలు నేలమీంచి వెళ్తున్నట్టున్నా యువి.

డాక్టరొచ్చి వెళ్తున్నాడు...

నాగరాజన్‌లో మార్పులేదు. సన్నగా వుండే తను ఇంకా సన్నగా అయిపోతున్నాడు. చిక్కినబల్లిలా తయారవుతున్నాడు.

డాక్టరొచ్చి వెళ్తూ అడిగాడు... 'కండీషన్ బాగానే వుంది. మరి మనిషెందుకలా అయిపోతున్నాడో...'

'నన్నడుగుతారేమిటండీ... డాక్టరు మీరుకదా...' తిరిగి అడిగిందామె.

బుర్రపట్టుకు వెళ్లిపోయాడు డాక్టరు. ఆమె ఊపిర్ని భారంగా వదిలి ఏవియం రాజేశ్వరీలో రిలీజయిన రజనీకాంత్ సిన్మా కెళ్లిపోయింది. తనూ, తన ఆనందమే తప్ప ఇంకెవర్నీ పట్టించుకోని తత్వం ఆమెది. పిల్లలు కూడా అంతే. ఆమెలాంటి వాళ్లే.

నెలరోజులు దాటాయి. నాగరాజన్ అసలు మంచం దిగలేదు. ఇక బతుకతాననే ఆశ పూర్తిగా పోయింది అతనికి. ఎవరికైనా చెపుదామంటే వినే వాళ్లే లేరు. అసలు తనని పట్టించుకునేవాళ్లే లేరు.

★★★

జన్మలో ఎప్పుడూ అంత భయానకమైన రోజుని తను చూడలేదు.

మంచంమీద పడుకుని వున్నాడు. వందలాది పాములు తన శిరస్సునుంచి సిరిపాదం వరకూ చుట్టేసుకుని ఒకదాన్నొకటి అల్లుకుని పెనవేసుకుపోయి మాగన్నుగా నిద్రపోతున్నాయి. మధ్యమధ్య బుసలు కొడ్తున్నాయి. కదిలితే కసుక్కున కాటేస్తాయి.

అరుస్తూ తెరిచాడు కళ్లు. పాముల్లేవు. తన వంటినిండా దుప్పటి, తెల్లటి పొరలాంటి దుప్పటి... కప్పబడి వుంది. భయంతో విడుస్తున్నాడు ఊపిరి. ఇక నిద్ర రాలేదు.

నిశ్శబ్దంగా వున్న గదిలోకి తన ఇద్దరు పిల్లలూ వస్తున్న అరుపులు విన్పించాయి. వాళ్లు మిద్దె మీదున్న పాతకాలం మృదంగాన్ని కిందికి దించి వంతులవారీగా తన్నుకుంటూ గదిలోకొచ్చారు. పెద్దపిల్లాడు మృదంగాన్ని ఒక తాపు తన్నేసరికి అది గోడకు గుద్దుకుంది. దాంట్లోంచి నిజంగానే చిన్న పాము పిల్ల బయటికొచ్చి జరజరా పాక్కుంటూ వెళ్లిపోయింది. కెవ్వున అరుస్తూ పారిపోయారు పిల్లలు. అది చూసిన నాగరాజన్‌కి స్పృహ తప్పింది.

★★★

ఎక్కడో సుదూరంగా నాగస్వరం వినిపిస్తోంది. తనకి తెలుసు.... అది తను వాయించిందే... కాని, ఎక్కడ ఎప్పుడు వాయించాడో గుర్తుకు రావడం లేదు. పోనుపోను ముమ్మరంగా వినిపించేసరికి కళ్లు తెరిచాడు నెమ్మదిగా.

మంచానికి దూరంగా టేపురికార్డర్‌లో కొత్త క్యాసెట్టు తిరుగుతోంది. ప్రక్కనే తన రంగులఫోటో వున్న హెచ్.ఎం.వి. క్యాసెట్ ఐసి కవర్ పడుంది. దృష్టి కిటికీ మీదికి మళ్లింది.

'పాము...'

ఆ వెన్నెల రాత్రి తను తొక్కిన పాము. నెమ్మదిగా టేపురికార్డర్ వేపు పాకుతూ వచ్చి, విన్పించే నాగస్వరానికి ఆనందంతో పడగవిప్పి తన్మయత్వం చెందుతూ లయగా తలాడిస్తూంది.

పామునీ, తిరుగుతున్న క్యాసెట్టునీ మార్చిమార్చి చూస్తున్నాడు తను.

క్యాసెట్టు అయిపోయింది. నాగస్వరం ఆగిపోయింది. తన్మయత్వంలో ఆడిన పాము అక్కడ నిశ్శబ్దం ఏర్పడేసరికి 'బుస్స్స్...'మని టేపురికార్డర్ మీద మూడు కాట్లు వేసింది. అప్పటికీ నాగస్వరం వినిపించక పోవటంతో, దగ్గరలో వున్న నాగరాజన్‌ని ఏం చెయ్యకుండా తన దారిన తను శరవేగంతో వెళ్లిపోతుంటే మిడిగుడ్లతో ఆ పామునే చూస్తూ వుండిపోయిన అతడు, ఇక జన్మలో పామంటే భయపడలేదు.

అలా ఆ నాగుపాము తన శరీరంమీద కాకుండా తన భయంమీద కాటు వేయడంతో ~~ఈ~~ జన్మకి పాము అంటే భయం పోయింది.

కారైకుడి నాగరాజన్‌కు!

('కృష్ణాపత్రిక' మే 1979)✳